క్లుప్తంగా

ప్రాచీన కళలను ప్రోత్సహిస్తాం



వేదికపై కళాకారులతో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

కుల్కచర్ల: ప్రాచీన కళలను ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి చౌడాపూర్ మండల కేంద్రంలో ప్రదర్శించబడిన భక్తసిరియాల వీధినాటకాన్ని ఎమ్మెల్యే వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మిక కథలను నాటకాల రూపంలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రాచీన కళలు, కళాకారులకు ప్రోత్సహిస్తూనే.. తోడ్పాటునందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్, నాయకులు యాదయ్య, రాములు, వెంకట్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొండల్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం



కొండల్‌రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న రిటైర్డ్ జడ్జి వెంకటేశన్ తదితరులు

మర్పల్లి: సనగారి కొండల్ రెడ్డికి సామాజిక సేవ రంగాలో అరుదైన గౌరవం దక్కింది. కొండల్‌రెడ్డి.. తనకు చెందిన ఎస్‌కేఆర్ ట్రస్టు ద్వారా చేసిన సేవలను గుర్తించిన పీపుల్ ఫోరం ఆఫ్ ఇండియా భారత్ సేవక్ సమాజ్.. తమిళనాడు రాష్ట్రం గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ.. ఇంటర్నేషనల్ వర్చువల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో.. చెన్నయ్‌లోని భారతీయ విద్యాభవన్‌లో డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతరం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కొండల్‌రెడ్డి మాట్లాడారు. తన సేవాకార్యక్రమాలకు ప్రతి ఫలంగానే ఈ గౌరవం దక్కిందని, అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి చేరిన ధ్వజ స్తంభం



కలప ధ్వజ స్తంభం

కొడంగల్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రతిష్ఠించడానికి నార వేప చెట్టు (కలప) ధ్వజ స్తంభం శనివారం ఆలయానికి చేరింది. ఖమ్మం జిల్లా భద్రాచలం పాల్వంచ అటవీ ప్రాంతం నుంచి కలపను సేకరించారు. ఈ నెల 23న పౌర్ణమి రోజు ఆలయ కమిటీ సభ్యులు కానుకుర్తి నర్సిరెడ్డి, పి.శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్వంచకు వెళ్లి, చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెట్టును నరికించి ఆలయానికి వాహనంలో తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులు డాక్టర్ రవీంద్రా యాదవ్, ఉమాపతి గౌడ్ హర్షం వ్యక్తంచేశారు.

అల్ల నేరేడు @ 200



తాండూరు రూరల్: అల్ల నేరేడు పండ్లు కిలోకు రూ.200ల ధర పలుకుతోంది. ఈ పండ్లలో పోషక విలువలు అధికంగా ఉండటంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు ఈ పండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి.

పుట్టిన రోజున మొక్కలు నాటండి



మొక్కను నాటిన దంపతులు

ధారూరు: అటవీశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్మృతివనంలో.. కూతురు జన్మదినం సందర్భంగా శనివారం మొక్కను నాటి నీరు పోశారు తల్లిదండ్రులు. మండల పరిధి రాంపూర్‌తండాకు చెందిన నాగేందర్ నాయక్, ప్రియనాయక్ దంపతుల కూతురు తన్వీ పుట్టినరోజు సందర్భంగా మొక్కను నాటి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతు బాధ్యతగా మొక్కను నాటినట్లు తెలిపారు. ప్రతి కుటుంబం తమ వారి జన్మదినం సందర్భంగా 5 మొక్కలు నాటాలని సూచించారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త

- గుర్తింపు పొందిన దుకాణాల నుంచే కొనుగోలు చేయండి
- పంటకాలం పూర్తయ్యే వరకు విత్తన సంచిని దాచండి
- రైతులకు సూచించిన వ్యవసాయ అధికారులు



ధారూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ ఝాన్సీలక్ష్మి

ధారూరు: 'నకిలీ విత్తనాల విషయంలో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి. గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణంలోనే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. తప్పనిసరిగా రసీదు తీసుకోవాలి. పంటకాలం పూర్తయ్యే వరకు విత్తన ప్యాకెట్(ఖాళీ)ను భద్రపర్చుకోవాలి' అని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. వానాకాలం సీజన్ ప్రారంభం నేపథ్యంలో విత్తనాల కొనుగోలు, ఎప్పుడు విత్తుకోవాలి, జాగ్రత్తలు తదితర వాటిపై పలు మండలాల్లోని రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. శనివారం దారూరు మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఝాన్సీలక్ష్మి, ఏఈఓ సంజూరాథోడ్‌తో కలిసి మాట్లాడారు. వానాకాలం సీజన్‌లో విత్తనాలు విత్తేందుకు రైతులు సమాయత్తం అయ్యారని తెలిపారు. దుక్కులు దున్నడం, సేంద్రియ ఎరువులు చల్లడం లాంటి పనులు మొదలు పెట్టారని చెప్పారు. ఇందుకు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు ఫర్టిలైజర్ షాపులను ఆశ్రయిస్తున్నారని వెల్లడించారు.

సమాచారం ఇవ్వండి

విత్తనాలను ఖరీదు చేసే సమయంలో అనుమానం కలిగితే.. వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని ఝాన్సీలక్ష్మి అన్నదాతలకు సూచించారు. విత్తనాలు తీసుకుంటే ప్యాకెట్‌పై లాట్ నంబర్, గడువు తేదీని గమనించాలన్నారు. గ్రామాల్లోకి కొత్తవారు ఎవరైనా విత్తనాలు విక్రయించడానికి వస్తే అప్రమత్తంగా ఉంటూ.. తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. నకిలీవి కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. ప్రతి ఫర్టిలైజ్ దుకాణంలో రిజిస్టర్ ఉంటుందని, అందులో మీ వివరాలను నమోదు చేయించుకోవాలని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో రైతు నాయకులు ప్రవీణ్‌గౌడ్, సతీష్ పటేల్, ఉపాధి ఏపీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండాలి

యాలాల: నకిలీ పత్తి విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ తాండూరు ఏడీ రుద్రమూర్తి అన్నారు. మండల పరిధి బాగాయిపల్లి, కమాల్‌పూర్, లక్ష్మీనారాయణపూర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏడీ మాట్లాడారు. సీల్ లేని సంచుల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదని చెప్పారు. విత్తనాల కొనుగోలు అనంతరం రసీదు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల నుంచే విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యాదగిరి, ఏఈఓలు శిరీష, మదన్‌మోహన్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఎరువులు

బంట్వారం: వానాకాలం సీజన్ నాటికి రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచామని వ్యవసాయ సహకార సంఘం సీఈఓ బ్రహ్మం తెలిపారు. సంఘం గోడౌన్‌లో ఎరువుల బస్తాలను డంపు చేశారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడారు. సంఘం పరిధి తొర్మామిడి, కోట్‌పల్లి, బంట్వారం గిడ్డంగుల్లో ఎరువుల బస్తాలను పంపిణీకి సిద్ధంగా ఉంచామని తెలిపారు. శనివారం మూడు పాయింట్లకు సంబంధించి 60టన్నుల ఎరువుల బస్తాలు వచ్చాయని వెల్లడించారు. ఒక్కో డీఏపీ బస్తాకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.1,350 ప్రకారం రైతులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాస్, సిబ్బంది నరేందర్, నర్సింలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



యాలాల: బాగాయిపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ రుద్రమూర్తి

అప్రమత్తత అవసరం



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ జిల్లా అధికారి గోపాల్

నవాబుపేట: ఎరువులు, విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ జిల్లా అధికారి గోపాల్ సూచించారు. మండల కేంద్రం రైతువేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో లూజు సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని చెప్పారు. విత్తనాలు కొనుగోలు చేసిన షాపు నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలని వెల్లడించారు. ఇందులో ఏడీఏ వినోద్‌కుమార్, ఏఓ ప్రసన్నలక్ష్మి, ఏఈఓలు రమేష్, రమాదేవి, లక్ష్మీప్రసన్న, ఆదీల్, శ్రావన్, రైతులు పాల్గొన్నారు.

రసీదు తప్పనిసరి

తాండూరు రూరల్: విత్తనాలు కొనుగోలు అనంతరం రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సిరిగిరిపేట్ క్లస్టర్ ఏఈఓ శిరీష అన్నారు. మండల పరిధి సిరిగిరిపేట్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. పొలంలో తేమ ఉన్నప్పుడే విత్తనాలు విత్తుకోవాలని కర్షకులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: సురాయిపల్లి సబ్‌స్టేషన్, కుదురుమళ్ల ఫీడర్‌లో మరమ్మతులు, పరిసరప్రాంతాల్లో చెట్ల నరికివేత కారణంగా వీటి పరిధి గ్రామాల్లో ఆదివారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మహిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధాన్యం బస్తాలతో మార్కెట్ కళకళ

ధారూరు: వ్యవసాయ మార్కెట్ ధాన్యం బస్తాలతో కళకళలాడుతోంది. శనివారం రైతులు వాహనాల్లో వేలాది వడ్ల సంచులను తీసుకు రాగా.. హమాలీలు దిగుమతి చేశారు. దొడ్డు రకం ధాన్యం బస్తాలు 3,383 రాగా.. క్వింటాల్‌కు రూ.2 వేల నుంచి రూ.2,050 ధరతో కొనుగోలు చేసినట్లు కార్యదర్శి సిద్దమ్మ తెలిపారు. సన్న రకం 1,383 బస్తాలు వచ్చాయని, క్వింటాకు రూ.2,300 నుంచి రూ.2,340 ధరతో కొనుగోళ్లు జరిపినట్లు ఆమె చెప్పారు. అలాగే మొక్కజొన్న 952 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ.2,300 నుంచి రూ.2,340 వరకు ధర పలికిందని కార్యదర్శి పేర్కొన్నారు.

మండుతున్న కూరగాయల ధరలు

ధారూరు: అన్నింటిలో నన్నేసి చూడు అంటుంది ఉప్పు. గృహిణులు ప్రతి కూరలో, పప్పులో, ఆకు కూరల్లో టమాటను వాడటం షరా మామూలు. ఉప్పు ధర ఎలా ఉన్నా.. టమాట ధర మాత్రం ధారూరు సంతలో కిలో రూ.100 పలుకుతోంది. దాంతోపాటే.. తానేమి తక్కువ కాదంటూ.. బెండ రూ.80, వంకాయ రూ.80కి చేరింది. ఇక ఆకు కూరలు సైతం సామాన్యుడికి చిక్కడం లేదు. పాలకూర గతవారం రూ.10కి నాలుగు కట్టలు ఇవ్వగా.. ఇప్పుడు వ్యాపారులు రెండు మాత్రమే ఇస్తున్నారు. పుంటి, మెంతం కూరల ధరలు రెట్టింపు అయ్యాయి.

19,957 బస్తాల ధాన్యం కొనుగోలు



జనగాంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

పెద్దేముల్: తాండూరు డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మండల పరిధి మంబాపూర్, జనగాం గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం ద్వారా శనివారం నాటికి 120 మంది రైతుల నుంచి 19,957 బస్తాల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు కేంద్రం ఇన్‌చార్జి నజీర్ తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2,203, బి గ్రేడ్‌కు రూ.2163 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు ధాన్యంతో పాటు పట్టా పాసుబుక్, బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్స్ కాపీలు తీసుకుని, ఆయా గ్రామ పంచాయతీ రెవెన్యూ కార్యదర్శుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించామని, గన్నీసంచుల సమస్యను తీరుస్తున్నట్లు చెప్పారు.

శివసాగర్‌లో చేపల వేట

యాలాల: మండల పరిధి శివసాగర్ ప్రాజెక్టులో మత్స్యకారులు చేపల వేట ముమ్మరం చేశారు. శనివారం జలాశయంలో సుమారు 10 కిలోల బరువు ఉన్న వాల్గా చేపలు వలకు చిక్కాయని గంగపుత్రులు తెలిపారు. వాల్గాతో పాటు కోరమీను, బంగారు తీగ తదితర రకాల చేపలను పట్టి, విక్రయించడానికి నగరానికి తరలిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి చేయూత

ధారూరు: ధారూరు బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి లయన్స్‌క్లబ్ ముందుకు వచ్చిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, లాయర్ సంపూర్ణానంద్‌రావు తెలిపారు. శనివారం పాఠశాలను ఆయన సందర్శించారు. ప్రధానోపాధ్యాయురాలితో మాట్లాడారు. పాఠశాలలో మరుగుదొడ్లు ఎక్కడ నిర్మిస్తే బాగుంటుందని ఆయన హెచ్‌ఎంను అడగా.. ఆమె అందుకు అనువైన స్థలాన్ని చూపించారు. అనంతరం లాయర్ మాట్లాడారు. ధారూరుతో పాటు కేరెళ్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సోమవారం లయన్స్ క్లబ్ ప్రతినిధులు రెండు పాఠశాలను సందర్శించి, ఒక్కో బడికి ఎన్ని మరుగుదొడ్లు నిర్మించాలో హెచ్‌ఎంలతో చర్చించి, తగిన నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.నారాయణరెడ్డి, బోయిని అంజయ్య, సతీష్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

పూడూరు: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సైబేజ్ ఆశా స్వచ్ఛంద సంస్థ సీఎస్ఆర్ అనపురపు సురేష్ సూచించారు. శనివారం మండల పరిధి దేవనోనిగుడలో గ్లోబల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఇందులో సైబేజ్ ప్రతినిధులు తిరుపతి, సురేంద్ర, వైద్యులు ప్రతిభ, అశోక్, మాజీ సర్పంచ్ బిచ్చన్న, నారాయణ, సీతారాంరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా నర్సరీల నిర్వహణ



కుల్కచర్ల: నర్సరీని పరిశీలిస్తున్న శ్రీనివాస్ రెడ్డి



పూడూరు: డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

మొక్కల పెంపకాన్ని పరిశీలించిన అధికారులు

కుల్కచర్ల: నర్సరీల నిర్వహణ పక్కాగా జరుగుతుందని, మొక్కల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నర్సరీని కార్యదర్శి పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. గ్రామ పరిధిలో నాటేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నామని తెలిపారు.

మొక్కలు సిద్ధంగా ఉంచండి

కొడంగల్: వర్షాలు కురిసే సమయానికి.. మొక్కల పంపకానికి సిద్ధంగా ఉండాలని నర్సరీ నిర్వాహకులను తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆదేశించారు. మండల పరిధి రుద్రారం గ్రామంలో తహసీల్దార్ పర్యటించారు. నర్సరీలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి జీపీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు.

ముందే గుంతలు తీయించాలి

పూడూరు: వర్షాలు పడిన వెంటనే హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచాలని డీఎల్‌పీఓ సంధ్యారాణి సూచించారు. పూడూరు పంచాయతీలో పారిశుద్ధ్య పనులు, డంపింగ్ యార్డు, పల్లె పకృతివనం, నర్సరీలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ మాట్లాడారు. మొక్కలు నాటేందుకు గుంతలు తీయించాలని, వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు సులువుగా ఉంటుందని తెలిపారు. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జీపీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినోద, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. రుద్రారం పెద్ద గ్రామమని, తాగునీటి ఎద్దడి, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని సూచించారు.

గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం



కలెక్టర్ నారాయణరెడ్డితో గ్రామస్తులు

విచారణకు గ్రామస్తుల విజ్ఞప్తి

దోమ: జీపీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేయించాలని రాకొండ గ్రామస్తులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి సమస్యను వివరించారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడారు. గ్రామంలో జనరల్ ఫండ్స్, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు రూ.9 లక్షలు ఉండగా.. గత సర్పంచ్ మరిది, పంచాయతీ కార్యదర్శి ఏకమై.. తప్పుడు లెక్కలు చూపించి, డబ్బులను కాజేశారని ఆరోపించారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్.. అధికారులతో విచారణ చేయిస్తామని, అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు లక్ష్మయ్య, శ్రీనివాస్, వెంకటయ్య, నర్సింహులు, రమేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయాన్ని పరిశీలిస్తున్న దేవాదాయశాఖ అధాకారి

పరిగి: ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా ఏఈ తులసిరాం అన్నారు. పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం శిథిలావస్థకు చేరిందని, పునర్నిర్మాణం చేపట్టాలని స్థానికులు కొందరు దేవాదాయ శాఖకు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఆ శాఖ అధికారులు శిథిలావస్థ ఆలయాన్ని సందర్శించి కొలతలు తీసుకున్నారు. అనంతరం ఏఈ మాట్లాడారు. ఆలయం పూర్తిగా శిథిలావస్థలో ఉందన్నారు. అందుకే మూడు దశాబ్దాలుగా ధూపదీప నైవేద్యాలు జరగడం లేదని పేర్కొన్నారు. గతంలో ఆలయంలోని విగ్రహం చోరీకి గురయిందని, నాటి నుంచి ఎలాంటి అభివృద్ధి జరగలేదని వివరించారు. గుడి పునర్నిర్మాణం గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ముకుంద నాగేశ్వర్, రాముయాదవ్, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు 'ఆదర్శం'గా ఉండాలి

- నాణ్యత విషయంలో రాజీవద్దు
- ఎంపీడీఓ రాములు



పాఠశాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీఓ రాములు తదితరులు

బంట్వారం: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ రాములు అన్నారు. శనివారం ఆయన మండల పరిధి బొప్పునారం, బస్వాపూర్, బంట్వారం గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. ఆదర్శ పాఠశాలల కింద మండలానికి సుమారు రూ.1 కోటి మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. గ్రామ మహిళా సమాఖ్య సంఘాల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు కొనసాగుతాయని పేర్కొన్నారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా, ఎక్కడకూడా అవకతవకలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆ సంఘాలదేనని స్పష్టం చేశారు. జరుగుతున్న పనులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, ఎంఈఓ చంద్రప్ప, సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, ఆదర్శ పాఠశాలల అసిస్టెంట్ ఇంజినీర్ లక్ష్మణ్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, సీఆర్పీ నర్సింలు, జేఏ షఫీ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేస్తే.. సహించేదిలేదు



దొంతాన్‌పల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ

డంప్‌యార్డుల నిర్వహణ తీరుపై డీపీఓ సురేశ్‌మోహన్ ఆగ్రహం

చేవెళ్ల: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీపీఓ సురేశ్‌మోహన్ హెచ్చరించారు. శంకర్‌పల్లి మండలం దొంతాన్‌పల్లి, మహారాజ్‌పేట్ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉన్న పల్లె ప్రకృతివనాలు, గ్రామీణ క్రీడా ప్రాంగణాలు, డంప్‌యార్డులు, నర్సరీలు, వైకుంఠధామాలను పరిశీలించారు. గ్రామాల్లో నర్సరీలు, డంప్‌యార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో ఆయా గ్రామాల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలపై నిర్లక్ష్యం చేస్తే.. సహించేది లేదన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను రోజువారీగా సేకరించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు గ్రామంలోని సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి



పెద్దేముల్: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్ఐ గిరి సూచించారు. శనివారం మండల కేంద్రం బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన మమ్మద్ అన్వర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని ఎస్ఐ ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులకు తన వంతు సహకారం ఉంటుందని చెప్పారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని, సమాజానికి చేరువగా చేస్తాయని తెలిపారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఇందులో టోర్నీ నిర్వాహకులు సల్మాన్, బాబర్, సద్దాం, గయాజ్, ఆర్గనైజర్‌లు రహీం, జావీద్, తన్విత్, అలీబాబా, జమీర్, క్రీడా కారులు డీవై. ప్రసాద్, మమ్మద్ గౌస్, ప్రవీణ్ ఉన్నారు.

విద్యుత్ అంతరాయం నేడు

ధారూరు: ధారూరు, నాగసమందర్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో 3 గంటల పాటు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

1న ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

బంట్వారం: మండల కేంద్రం కోట్‌పల్లిలోని నల్ల పోచమ్మ దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం జూన్1వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

అనంతగిరి: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెండో రోజు శనివారం జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 436మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 407మంది పరీక్ష రాశారు. 29మంది గైర్హాజరయ్యారు.

క్రీడలతో మానసికోల్లాసం



కుల్కచర్ల: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ అన్నారు. శనివారం చౌడాపూర్ మండలం రాంసింగ్ నాయక్‌తండాలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నీలో క్రీడాకారులకు క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం శంకర్ మాట్లాడారు. యువత చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం పొందాలని సూచించారు. తద్వారా ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఇందులో హన్మంతు, వినోద్, రాహుల్, చేతన్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.